పెద్దాస్పత్రిలో సేవలు మృగ్యం

- 'పురం' మాతాశిశు కేంద్రంలో వేధిస్తున్న వైద్యుల కొరత
- బాలింతలు, గర్భిణులు అవస్థలు
- ఇద్దరు వైద్యులతోనే సేవలు అందిస్తున్న వైనం
- గర్భిణులకు వైద్యసేవల జాప్యంతో అవస్థలు


హిందూపురం ప్రభుత్వాస్పత్రిలోని మాతాశిశు కేంద్రం


మాతాశిశు కేంద్రంలోని కాన్పుల వార్డు

హిందూపురం టౌన్: 'పురం' పెద్దాస్పత్రిలో వైద్య సేవలు అందక రోగులు అవస్థలు పడుతున్నారు. అందులో మాతాశిశు కేంద్రంలో ప్రసవాలకు అన్ని సౌకర్యాలూ ఉన్నా వైద్యుల కొరత వేధిస్తోంది. దీంతో రోగుల రెఫర్ ఆస్పత్రిగా పేరుగాంచింది. సకాలంలో వైద్యసేవలు అందలేదని గర్భిణులు, వారి బంధువులు ఫిర్యాదు చేస్తున్నా .. పట్టించుకునే వారులేరు. వైఎస్సార్‌సీపీ హయాంలో వైద్యసేవలు సకాలంలో అందేవని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పెద్దాస్పత్రిలోనే సక్రమంగా వైద్య సేవలు అందించడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతాశిశు కేంద్రంలో వైద్యుల కొరత వేధిస్తోంది. మాతాశిశు కేంద్రంలో నలుగురు గైనకాలజిస్టులు ఉండాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారు. వీరిలోనూ ఒకరిని డిప్యుటేషన్‌పై మరో ఆస్పత్రికి వారంలో రెండు రోజుల పాటు వైద్య శాఖ ఉన్నతాధికారులు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఒక్కరే మాతాశిశు కేంద్రంలో కాన్పుల వార్డు మొత్తానికి వైద్య సేవలందించాల్సిన పరిస్థితి. ఆస్పత్రిలో నలుగురు వైద్యులున్నప్పటికీ ఒకరు మెటర్నిటీ సెలవుపై వెళ్లగా, మరొకరు విధులకు హాజరు కావడంలేదు. ప్రస్తుతం గైనకాలజిస్ట్ డాక్టర్ బాబాబుడేన్, మరో గైనకాలజిస్ట్ డాక్టర్ నీరజ విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీరిలో డాక్టర్ బాబాబుడేన్‌ను డిప్యుటేషన్‌పై అధికారులు పెనుకొండలోని సీహెచ్‌సీకి గురు, శుక్రవారాల్లో వైద్యసేవలందించడానికి పంపారు. దీంతో ఆ రోజుల్లో డాక్టర్ నీరజ ఒక్కరే వైద్యసేవలందించాల్సి ఉంది.

రోజూ వందల సంఖ్యలో ఓపీ..

హిందూపురంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న మాతాశిశు కేంద్రానికి హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని 13 మండలాల గర్భిణులు, బాలింతలు వస్తుంటారు. ఆస్పత్రిలో గైనిక్ వార్డులో ఓపీకి నిత్యం దాదాపుగా 120 మంది దాకా వస్తారు. రోజూ అడ్మిషన్‌లో 50 నుంచి 60 మంది వరకూ ఉంటారు. రోజుకు 7 నుంచి 8 ప్రసవాలు జరుగుతుంటాయి. రోజు ఇద్దరిని చొప్పున గర్భిణులను ఆస్పత్రి నుంచి రెఫర్ చేస్తుంటారు. రెఫర్ చేసే కేసులను తగ్గించాలని జిల్లా కలెక్టర్‌తో పాటు డీజీహెచ్ఎస్, వైద్య శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నా ఖాతరు చేయడం లేదు. వైద్యుల కొరత కూడా రోగులను రెఫర్ చేయడానికి కారణంగా చెప్తున్నారు. ఇద్దరు వైద్యులే ఉండడంతో ఓపీ సేవలు, ఇన్‌పేషెంట్స్ సేవలు, రౌండ్స్‌తో పాటు ప్రసవాలు, సిజేరియన్లు అన్నీ చూడాల్సి ఉంది. పగలు, రాత్రి ఇద్దరు వైద్యులే విధులు నిర్వహించాలి. గురు, శుక్ర వారాల్లో ఒక్కరే అన్ని చూసుకోవాల్సి ఉంది. దీంతో వీరికి ఇబ్బందులు తప్పడం లేదు. మాతాశిశు కేంద్రంలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించడానికి ఇద్దరు వైద్యులను నియమించాల్సి ఉన్నా.. ఉన్న వైద్యులే మరో ఆస్పత్రికి డిప్యుటేషన్ వేయడంపై ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గర్భిణులకు వైద్యసేవలందించడంలో జాప్యం జరగకుండా వైద్యుల కొరతను తీర్చాలని రోగులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతాశిశు కేంద్రంలో వైద్యుల కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం. మాతాశిశు కేంద్రంలో నలుగురు డాక్టర్లలో ఒకరు మెటర్నిటీ లీవ్‌లో ఉన్నారు, మరోకరు విధులకు హాజరు కావడం లేదు, ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు డాక్టర్లల్లో ఒకరిని రెండు రోజుల పాటు డిప్యుటేషన్‌పై మరో ఆస్పత్రికి ఉన్నతాధికారులు పంపుతున్నారు. ఆ రెండు రోజులు ఉన్న డాక్టర్‌తోనే వైద్యసేవలు అందించాల్సి ఉంది. ఓ డాక్టర్ విధులకు హాజరుకాకపోవడంపై త్వరలో నోటీసులు జారీ చేస్తాం. రోగులకు ఇబ్బందులు కలగకుండా వైద్యసేవలు అందిస్తాం.

– డాక్టర్ లింగన్న, సూపరింటెండెంట్, హిందూపురం

క్లుప్తంగా

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు

మడకశిరరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరు కాకపోయినా, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ భాస్కర్ హెచ్చరించారు. ఆయన గురువారం భక్తరపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయుడి పనితీరుపై మండిపడ్డారు. మార్పు రాకపోతే చర్యలు తప్పవన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలన్నారు.

పశు వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి


కృత్రిమ గర్భధారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత గర్భకోశ, కృత్రిమ గర్భధారణ, పశువైద్య చికిత్సలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధిసంస్థ కార్య నిర్వహణ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ సూచించారు. గురువారం బుళ్లసముద్రంలో ఉచిత గర్భ కోశ పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులలో చూడి నిర్ధారణ, తిరిగి ఎదకు వస్తూ కట్టకుండా నిలిచిపోయిన వాటిని గుర్తించి 31 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణ మందు తాపించి, పశువులకు పశు వైద్య చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీ అమర్, మాజీ సర్పంచ్ జయపాల్, పశువైద్య, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి


మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రాజు

మడకశిర: మడకశిర నగర పంచాయతీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సూచించారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించి, అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీపరిధిలో నెలకొన్న మంచినీటి సమస్య, పారిశుధ్య సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో ఇల్లు లేని పేదలకు ఇల్లు మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మున్సిపల్ ఏఈ మురళి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన అనాథ వృద్ధుడి మృతదేహానికి విజన్ ఇన్ కో ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందగా, వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే వృద్ధుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో విజన్ ఇన్ కో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రేణు చందన ఆధ్వర్యంలో వన్‌టౌన్ సిబ్బంది రవినాయక్, దిలీప్‌తో పాటు ఫౌండేషన్ సభ్యులు దిలీప్ కుమార్, అఖిల్ కుమార్, సుహేల్‌లు పట్టణంలోని మోతుకుపల్లి శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిపారు.

ఘనంగా ధనుర్మాస పూజలు


అలంకరణలో వేంకటేశ్వరస్వామిస్వామి

అమరాపురం: మండల కేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు గురువారం ధనుర్మాసపు పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. భక్తులు తెచ్చిన వివిధ పూలతో ప్రత్యేక అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు.

అందరూ ఉత్తీర్ణత సాధించాలి


పెద్దమంతూరులో విద్యార్థులకు మోడల్ పేపర్లను అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు


మోడల్ పేపర్లను విడుదల చేస్తున్న దృశ్యం

రొద్దం: పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్)జిల్లా కార్యదర్శి నరేష్‌కుమర్, సీనియర్ నేత నారాయణస్వామి పేర్కొన్నారు. గురువారం పెద్దమంతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రాష్ట్ర శాఖ రూపొందించిన మోడల్ పేపర్లను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినదానికి ఈ మోడల్ పేపర్లు ఎంతగానో ఉపయోగపడతానికి వారు పేర్కొన్నారు. యూటీఎఫ్ మండలాధ్యక్షుడు గంగాధర్, గౌరవాధ్యక్షుడు రమేష్, సత్యమయ్య, పాఠశాల హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

మడకశిరరూరల్: పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు శ్రమించాలని హెచ్ఎం నరేంద్ర, జిల్లా యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు భూతన్న సూచించారు. యూటీఎఫ్ శాఖ అధ్యర్యంలో రూపొందించిన టెన్త్ మోడల్ టెస్ట్ పేపర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. వారు మాట్లాడుతూ పాధ్యాయులచే రూపొందించిన మోడల్ టెస్ట్ పేపర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్యక్షుడు మాలింగప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి


సభ్యత్వ నమోదు చేపడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

పరిగి: ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఏపీటీఎఫ్ నాయకులు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పీఎఫ్, ఏపీ జీఎల్ఐతో పాటూ ఆర్జిత సెలవుల నగదును ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి అంజనమూర్తి, మాజీ రాష్ట్ర కౌన్సిలర్ శివన్న, నరసింహారెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణానాయక్, వెంకటేష్, ఉపాధ్యాయులు రంగస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

షహీద్ అశ్వాఖుల్లాఖాన్ బిస్మిల్ వర్ధంతి


ప్రసంగ పోటీల్లో పురస్కారాలు అందుకుంటున్న విద్యార్థిని

హిందూపురం: స్థానిక రహమత్‌పురంలోని ఇక్రా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో షహీద్ అశ్వాఖుల్లా ఖాన్ రాంప్రసాద్ బిస్మిల్ వర్ధంతి వేడుకలు గురువారం నిర్వహించారు. టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ వేదిక అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో స్కూల్ హెచ్ఎం ఆఖీబ్ టిప్పు, షాకిరా సంయుక్త అధ్యక్షతన విద్యార్థులతో హిందూ ముస్లింలు మత సామరస్యం పరమత సహనంపై ప్రసంగాల పోటీ జరిగింది. కార్యక్రమంలో డాక్టర్లు అయేషా, అఫ్తాబ్, న్యాయవాది నవేరా రహ్మాన్, నాగరాజు, చైతన్య గంగిరెడ్డి, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు జుబేర్, ఇస్మాయిల్, రియాజ్, ఉబెదుల్లా హుసేన్, ఆడిటర్ జబీ, మురళీ దేశాయ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన


అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న సంఘాల నాయకులు


నల్లబ్యాడ్జీలతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

హిందూపురం/హిందూపురం టౌన్: పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను రాజకీయ పార్టీల ఐక్య వేదిక నాయకులు ఖండించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో రాజకీయ పార్టీల ఐక్య వేదిక నిరసన తెలియజేశారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యామ్ కిరణ్, ఎంఎస్ఎఫ్, ఆర్ ఎస్‌పి, ఏపిఆర్ఎస్ నాయకులు రవికుమార్, శ్రీనివాసులు, నౌషాద్, కాంగ్రెస్ నాయకులు కళీం,షాహిద్, హనుమంతు రాయుడు, జియా ,యూత్ కాంగ్రెస్ అంజి తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వాఖ్యలపై నిరసన

పెనుకొండ రూరల్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై దళిత సంఘాల నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్‌షాకు హోంమంత్రి పదవి కూడా అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా వచ్చిందన్నారు. హోం మంత్రి పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణ వీధుల్లో నల్లబ్యాడ్జీలు ధరించి మౌన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ, డీవీఎంసీ మాజీ సభ్యుడు ఎంఎన్ మూర్తి, కౌన్సిలర్ మారుతి, ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు, రవి, కేవీపీఎస్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు


రొళ్ల మండలం ఎం.రాయాపురంలో గ్రామసభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

రొళ్ల: రెవెన్యూ గ్రామసభ ద్వారా భూసమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి అన్నారు. గురువారం మండలంలోని ఎం.రాయాపురం సచివాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పై 15 అర్జీలు రైతుల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప, సర్వేయర్ కిరణ్‌కుమార్, వీఆర్వో నాగరాజు, రెవెన్యూ, సచివాలయం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాగు పట్టాలు ఇవ్వండి

సోమందేపల్లి: పందిపర్తి రెవన్యూ పొలంలో ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న రైతులకు సాగు పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమయ్య, వెంకటేష్, శ్రీనివాస్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోడిపల్లిలో గ్రామ సదస్సు

లేపాక్షి: మండలంలోని కోడిపల్లి గ్రామ సచివాలయంలో గురువారం ఉదయం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గంగాధర్, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సీపీఎస్‌పై ప్రభుత్వం మాట నిలుపుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సోమందేపల్లి: సీపీఎస్ ఉద్యోగుల సమస్యలపై కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకోవాలని ఏపీసీపీఎస్ఈఏ జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఓపీఎస్ సాధనకు ఉద్యోగులు సమష్టిగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రంగేష్‌కుమార్ చంద్రశేఖర్, సజ్జరాయప్ప, గణేష్, వినోద్‌నాయక్, ఇలియాజ్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ సమస్యల పరిష్కారానికి కృషి


మార్కెట్‌లో సమస్యలను వ్యాపారులతో తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం: హిందూపురం మార్కెట్ కాంప్లెక్స్ సమస్యలు పరిష్కరానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ బలరాంరెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కొత్త మార్కెట్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులు, వ్యాపారుల ఇబ్బందులను తెలుసుకున్నారు. గదుల వద్ద వ్యాపారుల పడుతున్న ఇబ్బందికరమైన పరిస్థితులు, కొందరు వ్యాపారులు ఇష్టానుసారంగా గదులను మరమ్మతులు చేసుకుని మరికొందరికి ఇబ్బంది పెట్టడాన్ని పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అధికారులతో చర్చించి వ్యాపారులందరికీ అనుకులంగా ఉండేలా తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల: పట్టణంలోని బేతాళం చర్చీ వీధిలో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన వివరాలు...బేతాళం చర్చి వీధిలో నివాసం ఉంటున్న స్పందన గురువారం ఇంట్లో యాసిడ్ తాగింది. చుట్టు పక్కలవారు, సమీప బంధువులు గమనించి ఆమెను వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో హిందూపురం తీసుకెళ్లారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ


శిక్షణలో పాల్గొన్న అధికారులు

రొద్దం: మండల పరిషత్ కార్యాలయంలోని సమవేశపు భవనంలో గురువారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామ్‌కుమార్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా అందరం సమన్వయంతో పనిచేయాలన్నారు. అన్నివర్గాల ప్రజలు భాగస్వాములైనప్పుడే సుస్థిరాభివృద్ధి సాధ్యమన్నారు. శిక్షణలో గ్రామాల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ గోవిందప్ప, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, ఐకేపీ, ఆరోగ్య శాఖ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ పరిశీలన


గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పరిగి: యర్రగుంట గ్రామంలో నిర్మించిన గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌ను గురువారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో ఏజీపీ సిటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి పర్యావరణ అనుమతులపై జేసీ పర్యటించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, ఆర్ఐ సిద్దేశ్వర్, మండల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

'స్మార్ట్ కార్డులను సద్వినియోగం చేసుకోండి'


కార్మికులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పావగడ: స్మార్ట్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్‌బాబు కార్మికులకు సూచించారు. స్థానిక సాయిరాం మందిరంలో గురువారం నిర్వహించిన స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కార్డులు పొందిన అసంఘటిత కార్మికులు, రవాణా శాఖకు చెందిన కార్మికులు కార్మిక సంక్షేమ శాఖ నుంచి అనేక సౌలభ్యాలు పొంద వచ్చన్నారు. అనంతరం పలువురు కార్మికులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్మిక శాఖ అధికారి హరీశ్, సీఐ సురేశ్, సీఐటీయూ అధ్యక్షుడు రామాంజినప్ప, బేకరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఏ-1 పరీక్ష నిర్వహణ తనిఖీ

రొళ్ల: మండలంలోని హొట్టేబెట్ట, అలుపనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎస్ఏ-1 పరీక్షలను గురువారం తనిఖీ చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలల హెచ్ఎంలు పరీక్ష ప్రారంభం సమయానికి గంట ముందు మాత్రమే ప్రశ్నపత్రాలను తీసుకెళ్లాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఏ-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల చదువు పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి రోడ్డుపై నిలిచిన నీరు

రొద్దం: మండలంలోని తురకలాపట్నం గ్రామంలో తాగునీటి పథకం పైపులైన్ నుంచి తాగునీరు లీక్ కావాడంతో పావగడ-పెనుకొండ ప్రధాన రోడ్డు మడుగును తలపించింది. వారం రోజులుగా రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, రోడ్డు పక్కన నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు, వివిధ వాహనాలు వేగంగా వచ్చినప్పుడు తమ ఇళ్లలోకి, ప్రయాణికులపైకి నీరు పడుతోందని తెలిపారు. ఫైబర్ నెట్ కేబుల్ పనులు చేసే తరుణంలో తాగునీటి పైపులు పగిలి పోవడంతో తాగునీరు రోడ్డుపై నిలిచినట్లు స్థానికులు తెలిపారు. పగిలిన పైపులకు మరమ్మతులు చేయకపోవడంతో వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు.


తురకలాపట్నంలో పైప్‌లైన్ పగిలిపోయి వాగును తలపిస్తున్న ప్రధాన రహదారి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723, 9705346587
9010200238, 9912220726